# బలి

ఆ రాత్రి ఆనందస్వామి ఆశ్రమంలో భజన కార్యక్రమం ముగిసేసరికి తొమ్మిది దాటింది. ఒక్కొక్కరే లేచి వెళ్ళిపోసాగారు. ఆశ్రమం ముందు వేసిన పందిట్లో ఒక మూల కూర్చున్న శేషమాంబకు మటుకు తను కూర్చున్న చోటు నుండి లేవబుద్ధికాలేదు. స్వామి కూర్చున్న వైపే ఆమె దృష్టి నిలిచి ఉంది. ఆయన చుట్టూ జనం. ఒకరి తర్వాత ఒకరికి ఆశీస్సులు ఇస్తున్నాడు. ఆయనా ఊరికి వచ్చి వారం దాటింది. శేషమాంబ నాలుగయిదు రోజులుగా ఆయనతో ఏకాంతంగా మాట్లాడటానికి ప్రయత్నిస్తోందికాని వీలు పడటంలేదు. ఎప్పుడూ ఎవరో ఒకరు ఆయన దగ్గిర ఉంటున్నారు. ఆయనతో మాట్లాడి తను పడుతున్న బాధలు చెప్పుకుంటే గాని తన హృదయ భారం తగ్గదు. ఆయన తనకేదయినా దారి చూపించకపోడు. ఏదేమయినా ఈ వేళ ఎంత రాత్రయినా ఉండి తను స్వామితో మాట్లాడి ఇంటికి వెళ్ళకూడదని నిర్ణయించుకుంది. ఒక్కొక్కరే ప్రసాదం తీసుకుని వెళ్ళి పోతున్నారు. ఇందాకటి వరకు కిటకిటలాడిన పందిరి పల్చబడుతోంది. చటుక్కున లేచి నిలబడేసరికి కళ్ళు తిరిగినట్లనిపించింది. పందిరి గుంజకు ఆనుకుని అలానే కొద్దిసేపు నుంచుంది. ఆకలి వేస్తోంది. కాళ్ళు చిన్నగా వణుకుతున్నాయి. నిన్న మధ్యాహ్నం తర్వాత తినటానికి ఏమీ దొరకలేదు. మంచి నీళ్ళతోనే పొట్ట నింపుకుంటోంది.

శేషమాంబకు ముప్ఫయి రెండు సంవత్సరాలుంటాయి. సన్నగా, చామన చాయలో ఉంటుంది. అంత పొడుగూ కాదు, పొట్టీ కాదు. ఆమెకు పదో ఏట పెళ్ళి అయింది. పెద్దమనిషయి కాపురానికి వచ్చిన రెండో సంవత్సరంలో ఆమె భర్త దేశాలు పట్టి వెళ్ళిపోయాడు. ఇప్పుడు ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో ఎవరికీ తెలియదు. ఇంట్లో వాళ్లు చేతులు దులుపుకుని వదిలేశాక ఇహ ఏ గతీ లేక బావగారయిన నరసింహులు పంచన చేరింది. ఆ ఇంట్ల ఆమె పనిమనిషి కన్నా హీనంగా చూడబడినా ఆ దిక్కు తప్ప తనకు వేరే అండలేకపోవటంతో కిమ్మనకుండా భరించింది. మూడునెలల కిందట నరసింహులు చనిపోవటం అతని కుటుంబం ఊరొదిలి పట్నం తరలి పోవటంతో శేషమాంబ తిరిగి ఒంటరి మనిషయింది. ప్రస్తుతం ఆమె పూజారి ఇంటి వెనక వరండాలో ఉంటోంది. పూజారిది పెద్ద కుటుంబం. రాబడి అంతంత మాత్రమే. అదీ

వాళ్ళకు ఏ మూలకూ రాదు. ఆనందస్వామి ఆ ఊరికి వచ్చిన రెండోరోజున శేషమాంబను పిలిచి "ఈ స్వాముల వారికి చాలా ఆశ్రమాలతో సంబంధాలుంటాయి. వారిని కలుసుకుని నీ కష్టాలు చెప్పుకుంటే వారు నీకేదయినా జీవనోపాధి కల్పించకపోరు" అన్నాడు. పూజారికి ఆమె భారంగానే ఉంది. పూజారి చెప్పింది కూడా ఆమెకు సబబుగా తోచి స్వామితో మాట్లాడాలని ఎంతో ఆతృతగా ఎదురుచూస్తోంది.

తొమ్మిదిన్నర దాటిన తర్వాత గాని స్వామితో మాట్లాడటానికి అవకాశం చిక్కలేదు. ఆయన దగ్గిరకు వెళ్ళి పాదాలు తాకి చేతులు జోడించి నిలబడింది. ఆయనతో సంభాషణ ఎలా మొదలు పెట్టాలో అర్థం కావటం లేదు. గుండె వేగంగా కొట్టుకుంటోంది. చల్లటిగాలి వీస్తున్నా నుదురు స్వేదంతో నిండిపోసాగింది. స్వామికి డెబ్బయి సంవత్సరాలుంటాయి. కాషాయరంగు దుస్తుల్లో మనిషి నిండుగా ఉన్నాడు. చేతిలోని మాల కదుపుతూ "నీ కష్టమేమిటో చెప్పు తల్లీ" అన్నాడు. ఆయన మాటలు సౌమ్యంగా ఉన్నాయి.

"స్వామీ! నేను దిక్కులేని దాన్ని. భయంకరమైన దరిద్రంలో బతుకుతున్నాను. నాకు ఎవరూ లేరు. మీరు నాకు జీవనోపాధి కల్పించారంటే మీమేలు మర్చిపోను. తల్చుకుంటే మీరు నాకు సహాయం చేయగలరు...." ఆమెకు దుఃఖం ఆగలేదు. ఏడుస్తూ ఈ మాటలు అన్నదో లేదో కూడా గుర్తులేదు. శోష వచ్చి కింద పడిపోయింది.

అరగంట గడిచాక కాని శేషమాంబకు స్పృహ రాలేదు. కళ్ళు తెరిచి చూసింది. ఒక పక్క ఆశ్రమ సేవకులు నిలబడి ఉన్నారు. మరో పక్క స్వామి కూర్చుని ఉన్నాడు. ఆమె చటుక్కున లేచి కూర్చోబోయింది. ఆయన ఆమెను వారించేసరికి లేచి కూర్చునే ప్రయత్నం విరమించుకుంటూ, రెండు చేతులు జోడించి "క్షమించండి. మీకు శ్రమ కలిగించాను" అంది నొచ్చుకుంటూ.

"ముందు ఆ పళ్ళరసం తీసుకోమ్మా" అని ఆశ్రమ సేవకుడు ఇచ్చిన గ్లాసు అందుకుని రసం తాగిన కొద్దిసేపటికి లేచి కూర్చోగలిగింది. సేవకులు ఆశ్రమంలోకి వెళ్ళి పోగానే, "నీ పరిస్థితి మళ్ళీ ఒకసారి వివరించమ్మా" అన్నాడు. ఆమె తన పరిస్థితి తెలియపరిచాక స్వామి కొద్ది సేపు కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ ఉండి చివరకు, "నీకేదయినా ఉపాధి తప్పకుండా కల్పిస్తాము..." ఆగి కళ్ళు తెరిచి రెండుక్షణాలపాటు ఆమె ముఖంలోకి పరీక్షగా చూసి, "అయితే, ఒకే ఒక షరతుమీద... మేము నీకు కల్పించే ఉపాధి సంగతి నువ్వు ఎవరితోనూ చెప్పకూడదు. గోప్యంగా ఉంచాలి" అన్నాడు.

"ఆ భగవంతుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. నేనీ విషయాన్ని గోప్యంగా ఉంచుతాను. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవ్వరికీ చెప్పను."

“ఆ మాట మీదే నిలబడు” అని స్వామి తన చేతిలో ఉన్న పదిరూపాయల కాయితం ఆమె కిచ్చి, “ఉంచు, మూడురోజుల తర్వాత ఒకసారి కనిపించు. నడవగలవు కదా?” అడిగాడు.

ఆమె తలూపింది.

“కొద్ది సేపట్లో నీకు భోజనం ఏర్పాటవుతుంది. చేసి వెళ్ళు” అని స్వామి లేచి ఆశ్రమంలోకి వెళ్ళి పోతుంటే రెండు చేతులెత్తి స్వామి వెళ్ళిన వైపు చూస్తూ నమస్కరించింది.

మూడురోజుల తర్వాత శేషమాంబ స్వామిని కలసినప్పుడు ఆయనామె చేతికి అరవై రూపాయలిచ్చి, “ఈ రాత్రి పదిన్నరకు విజయవాడ వెళ్లేందుకు బండి ఉంది. నీమూటా ముల్లె సర్దుకుని మూడో కంటికి తెలియకుండా ఆ బండి ఎక్కు. తెలతెల వారుతుండగా విజయవాడ చేరుకుంటావు. స్టేషన్ కుడివైపునున్న ప్రధాన ద్వారం వద్ద నిలబడి ఉండు. మా వాళ్ళు వచ్చి నిన్ను తీసుకు వెళ్తారు” అన్నాడు. ఆమె ఆయన్ని చాలా ప్రశ్నలు వేయాలనుకుంది. ఆయన ఏ అవకాశం ఇవ్వకుండా “ఇహ నువ్వు వెళ్లొచ్చు” అని కుడిచేయి ఊపాడు. శేషమాంబ అతని పాదాలకు నమస్కరించి వెళ్లిపోయింది.

మరుసటి రోజు ఉదయం ఆమె విజయవాడ స్టేషన్‌లో బండి దిగి బయటకు వచ్చి నిలబడిన వెంటనే పెద్దగడ్డం గుబురు మీసాలతో ఉన్న సాధువు ఆమె దగ్గిరకు వచ్చాడు. తలా, భుజాలు నల్లటి శాలువాతో కప్పుకుని ఉన్నాడు. “నీ పేరు శేషమాంబ కదూ?” అడిగాడు.

ఆమె తలూపగానే అతను తన చేతిలో ఉన్న కాయితాన్ని ఆమెకిచ్చి, “ఈ కాయితం నీకు అందచేయమని స్వామివారు చెప్పారు. ఇందులో ఉన్న చిరునామా కు వెళ్లి ఆ పేరుగలావిడను కలిస్తే నీ పని అవుతుంది. సరిగ్గా ఎనిమిదింటికి ఆ ఊరు వెళ్ళేందుకు బండి ఉంది” అని శేషమాంబ మరిన్ని వివరాలు అడిగే లోపల అతను జనంలో కలిసి బ్రిడ్జి మెట్లు ఎక్కి వెళ్లిపోయాడు. ఇతన్ని ఎక్కడో చూశాను అనుకుంది. ఎక్కడ చూసిందో ఎంతసేపు ఆలోచించినా గుర్తు రాలేదు. అతను మళ్లీ కనిపిస్తే బావుండు అనుకుంది. ఎనిమిదిన్నరకు బండి కదలగానే ఆమె కూర్చున్న పక్క పెట్టెలోంచి దిగుతూ అతను కనిపించాడు. అతన్ని పిలుద్దామని మాట నోటి వరకు వచ్చింది. ఏమని పిలవాలో అర్థం కాలేదు. బండి వేగం పుంజుకుంది.

శేషమాంబకు ఆశ్రయం ఇచ్చిన ఆవిడ పేరు లలితాదేవి. ఎనభయి సంవత్సరాల వయసుంటుంది. రాజఠీవిలో ఆవిడ అంత వయసున్న మనిషిలా కనిపించదు. ఆవిడ ఉండే భవంతి ఊరికి చాలా దూరంలో ఉంది. కోటకు ఉన్నట్లు చుట్టూ పెద్ద గోడ. అంత విశాలమయిన భవంతిలో ఆవిడా, తోటమాలి తప్ప ఎవరూ ఉన్నట్లనిపించలేదు. ఊరికి కరంటు ఉంది కాని ఆ భవంతికి లేదు. గోడ చుట్టూ చెట్లు ఉండటం వలన అక్కడ భవంతి ఉన్నట్లు వెంటనే తెలియదు. ఆమె అక్కడ చేరిన వారం రోజుల తర్వాత లలితాదేవి అంది, "నువ్వు మాకు ఎంతో నచ్చావు. నీ గురించి స్వాముల వారు మాకు తెలియజేశారు. మా గురించి నీకు చెప్పే ఉంటారు."

"నాకు, మీ గురించి ఏమీ చెప్పలేదు"

"మాది జమీందార్ల కుటుంబం. ఇప్పుడీ నలభై రెండు గదుల భవంతి, ఎర్రగడ్డలో కొంత భూమి తప్ప ఏమీ మిగల్లేదు. ఆనందస్వాముల వారు మాకు బంధువు. పిన్న వయసులోనే సన్యాసం పుచ్చుకున్నారు. ఆయన అప్పుడప్పుడు ఇక్కడకు వస్తుంటారు. నీకిక్కడెలా ఉంది?"

"బాగానే ఉందండీ. ఏమీ తోచటం లేదు. మీరు నాకేమీ పని చెప్పటం లేదు."

"మాకు తోడుగా ఉండి ఈ ఇల్లు చూసుకోవటమే నీ పని."

లలితాదేవి రోజులో ఎక్కువకాలం పూజ గదిలో గడుపుతుంటుంది. భోజనాల సమయానికి మటుకు బయటకు వస్తుంటుంది. తోటమాలికి చెవుడు, ఉదయం నుండి సాయంత్రం వరకు తోటలో పనిచేసినవాడు చేసినట్లే ఉంటాడు. వీళ్ళిద్దరికీ వండిపెట్టడం శేషమాంబకు పెద్ద పనేమీ కాదు. కాలం గడవటం కష్టంగానే ఉంది. మాట్లాడేందుకు ఎవరూ ఉండరు. చదువుకునేందుకు పుస్తకాలు లేవు. కనీసం రామకోటి రాసుకుందుకు కాయితాలు కూడా లేవు. ఆ భవంతిలోని మధ్య గదికి, లలితాదేవి పడకగదికి, వంటగదికి తప్ప అన్ని గదులకూ తాళాలు వేసి ఉన్నాయి. మధ్యగది చాలాపెద్దగా పాతకాలపు సోఫాలతో నిండి ఉంది. ఆ గదిలో ఏ మూలనయినా నేలమీద కూర్చోవాలంటే శేషమాంబకు ఎక్కడలేని భయం వేస్తుండేది. గోడలకు తగిలించబడి ఉన్న పటాలలోని వ్యక్తులు ఆమెకు మనుషుల్లా కనిపించేవారు కాదు. క్రూరమృగాల్లా ఉండేవారు. ఎప్పుడా గదిలోకి అడుగు పెట్టినా వెన్నులోంచి భయం మొదలవుతుండేది. అందుచేత వీలయినంతవరకు ఆగదిలోకి అడుగుపెట్టేదికాదు. రాత్రిళ్లు వంటగదిలో చాపవేసుకుని ఒక మూలగా పడుకునేది. వంటగది బయటి వరండాలో తోటమాలి పడుకునేవాడు. చెట్లమీంచి వీచే హోరుగాలికి త్వరగా నిద్రపట్టేది కాదు.

చాలాసేపటి వరకు మెలకువగా ఉండిపోయేది. తలనిండా దుప్పటి కప్పుకుని కళ్ళు గట్టిగా మూసుకుంటే ఏ తెలతెలవారుతుండగానో నిద్రపట్టేది. ఆ కొద్ది నిద్రలోనే పిచ్చి పిచ్చి కలలు వస్తుండేవి.

నెలరోజులకు ఆ జీవితం మీద శేషమాంబకు విసుగు పుట్టింది. అక్కడినుండి వెళ్ళిపోదామని కూడా అనిపించింది. వెళ్ళి? అనుకునేది. బయట రెండుపూటలా కడుపునిండా తిండి ఎవరు పెడ్తారు? ఇంత తక్కువ పని ఎక్కడ ఉంటుంది? ఇలాటి ప్రశ్నలు తలెత్తుతుంటే వెళ్ళే ప్రయత్నం విరమించుకుంది. ఒకరోజు లలితాదేవి శేషమాంబను పిలిచి "ఇక్కడి జీవితం నీకు విసుగు పుడుతోంది కదూ?" అడిగింది నవ్వుతూ. శేషమాంబ అవుననలేదు. కాదనలేదు. నవ్వి ఊరుకుంది.

"మాకంటే ఈ జీవితం అలవాటయి పోయింది. ఇంతటి ప్రశాంత వాతావరణం నీకు ఎక్కడ దొరుకుతుంది? నీకు ఇక్కడ ఎటువంటి ఇబ్బందయినా ఉంటే మాతో చెప్పుకోవచ్చు."

"ఎటువంటి ఇబ్బంది లేదండీ."

"మేము నిన్ను ఎందుకు పిలిపించామంటే మాకు ఎర్రగడ్డలో పొలాలున్నాయని నీతో చెప్పాం కదా, వాటిని మేం కౌలుకిచ్చాం. అక్కడకు వెళ్ళి డబ్బులు వసూలు చేసుకుని రావాలి. ఈ సాయంత్రం బయల్దేరి వెళ్తున్నాం. తిరిగి రావటానికి వారం పడుతుంది. నీకు తోడుగా తోటమాలి ఉంటాడు. ఈ తాళాల గుత్తి నీ దగ్గిరుంచు" తాళంచెవి గుత్తి శేషమాంబకు ఇచ్చింది లలితాదేవి.

ఆ సాయంత్రం లలితాదేవి ఎర్రగడ్డ వెళ్లిపోయింది. ఆ రాత్రి శేషమాంబకు నిద్రపట్టలేదు. సూర్యోదయం వరకు మెలకువగానే ఉండిపోయింది.

మరుసటిరోజు మధ్యాహ్నం ఆనందస్వామి ఆ భవంతికి వచ్చాడు. ఆయనను చూడగానే శేషమాంబకు ఎక్కడలేని సంతోషం వేసింది. ఆమె ఆయనను భోజనం తయారుచేయబోతుంటే వారించి, "మేం భోజనం చేసే వచ్చాం. మేమీ ఊళ్ళో అడుగు పెట్టిన తర్వాత లలితాదేవి గారు ఎర్రగడ్డ వెళ్లారని తెలిసింది. ఎటూ వచ్చాం కదా, నిన్ను చూసి క్షేమసమాచారాలు తెలుసుకుందామనిపించింది. మాకూ ఎర్రగడ్డలో పని ఉంది. మేం వారిని అక్కడ కలుస్తాం. నీ సంగతి చెప్పు. ఎలా ఉన్నావు?" అడిగాడు.

"బావున్నాను స్వామీ."

"ఇక్కడి జీవితం నీకు విసుగ్గా ఉందా?"

"లేదు స్వామీ."

"ఈ భవంతిలో చిక్కేమిటంటే బయటి ప్రపంచంతో సంబంధం ఉండదు. నీకు తెలుసో లేదో ఈ భవంతిలో పెద్ద గ్రంథాలయం ఉంది. రాజావారు, అంటే లలితాదేవి భర్తగారు కొన్ని వేల పుస్తకాలు సేకరించారు. నీకు పుస్తకపఠనం మంచి కాలక్షేపం అవుతుందనుకుంటాం. నీ అభిరుచికి తగిన పుస్తకం ఎన్నుకుని చదువుకుంటూ కూర్చుంటే సమయం ఇట్టే గడిచిపోతుంది. ఏమంటావు?"

అవునన్నట్లు తలూపి, "ఇక్కడ గ్రంథాలయం ఉన్న సంగతి నాకు తెలియదు స్వామీ" అంది.

"తెలియదా, విచిత్రంగా ఉందే? లలితాదేవిగారు నీకు చెప్పలేదా?"

తల అడ్డంగా ఆడించింది.

"మర్చిపోయి ఉంటారు. అదో దక్షిణం వేపున ఉన్న చివరిగది ఉంది చూసేవూ, అదే గ్రంథాలయం. లలితాదేవి గారు నీకు తాళం చెవి గుత్తి ఇచ్చారా?"

"ఇచ్చారు స్వామీ." అని తాళాల గుత్తి ఆయనకందించింది. ఆయన ఆ గుత్తిని పరీక్షగా చూసి ఒక తాళం చూపించి, "ఇది ఆ గ్రంథాలయపు తాళం చెవి. తలుపు తెరిచి నీకు కావలసిన పుస్తకాలు తీసుకో" అన్నాడు.

"వారు లేనప్పుడు ఆగది తలుపు తీయటం బావుంటుందా స్వామీ?"

స్వామి ఆమె వంక విసుగ్గా చూసి, "మేమే తలుపు తెరిచి నీకు పుస్తకాలు ఇచ్చినట్లు లలితాదేవి గారితో చెబుతాం కాని వెళ్లి పుస్తకాలు తెచ్చుకో" అని తాళాల గుత్తి శేషమాంబకు తిరిగి ఇచ్చి "ఆ గది చీకటిగా ఉంటుంది. తోటమాలిని అడిగి టార్చి తీసుకెళ్లు. కుడి వైపున్న బీరువాల్లో నవలలు, కథల పుస్తకాలూ ఉంటాయి. ఎడమవైపున్న బీరువాల్లో నాటకాలు, పురాణాలు, వేదాంతానికి సంబంధించిన పుస్తకాలూ ఉంటాయి. నీకు ఇష్టమైనవేమయినా తీసుకో" అన్నాడు.

శేషమాంబ తలూపి తోటమాలి దగ్గిర టార్చి లైటడిగి గ్రంథాలయం తలుపు తాళం తీసి లోపలికి తొంగి చూసింది. లోపల చీకటిగా ఉంది. కిటికీల్లోంచి వెలుగేమీ రావటం లేదు. భవంతి మధ్యగదంత పెద్దగా ఉందా గ్రంథాలయం. చుట్టూ బీరువాలు. బీరువాల నిండా పుస్తకాలు. టార్చి వెలుగు పల్చగా ఉంది. ఆ వెలుగు బీరువాల వరకు అందటం లేదు. లోపలకు రెండుఅడుగులు వేసింది. గది బయట అడుగుల చప్పుడు వినిపించేసరికి చటుక్కున వెనక్కి తిరిగేలోపల పెద్దశబ్దం చేసుకుంటూ తలుపులు మూసుకుపోయాయి. గుండె వేగంగా కొట్టుకోవటం మొదలెట్టింది. భయంతో తలుపుల దగ్గిరకొచ్చి గట్టిగా లాగింది. బయట గడిపెట్టినట్లు తలుపులు తెరుచుకోలేదు. లోపలివైపు

గడిలేదు. గట్టిగా కొట్టింది. తలుపులు తెరుచుకోలేదు. తాళం వేస్తున్న చప్పుడు విని "స్వామీ, స్వామీ" అని పెద్దగా అరుస్తున్నా అడుగుల చప్పుడు దూరమయింది. భయం ఎక్కువయి ఒంటికి చెమట పట్టసాగింది. వణుకుతున్న చేత్తో టార్చి గట్టిగా పట్టుకుని గది మధ్యలోకి చూసింది. అక్కడ ఎవరిదో పెద్ద విగ్రహం ఉంది. ఆ విగ్రహం చుట్టూ ఏడెనిమిది శవాలు పడి ఉన్నాయి. వేటిమీదా గుడ్డలు లేవు. రెండు అస్థిపంజరాలు ఉన్నాయి. శవాల నుండి వస్తున్న దుర్గంధానికి కడుపులో చేయిపెట్టి కెలికినట్లు అనిపించి వాంతి చేసుకోబోయి బలవంతంగా ఆపుకుని ముక్కుమూసుకుని విపరీతంగా వణికిపోతుంటే చేతిలోని టార్చి జారి కింద పడి పగిలి ఆరిపోయింది. ఆమె తలుపులను చేతులతో తడుతూ, కాళ్ళతో తన్నుతూ "స్వామీ, నన్ను రక్షించండి" అంటూ హృదయవిదారకంగా ఏడుస్తూ గొంతు పూడుకుపోయేవరకు అరిచి అరిచి సొమ్మసిల్లి తలుపు దగ్గిర పడిపోయింది.

శేషమాంబ గ్రంథాలయంలోకి వెళ్లిన వార్త ఆ మరుసటిరోజు తోటమాలితో ఆనందస్వామి లలితాదేవికి కబురుపంపించాడు.

*(ఒక ఆంగ్ల కథ చదివిన తర్వాత)*

◆ విజయ, మాసపత్రిక, మే 1982